# ఆనందో



# బ్రహ్మ

- సాయి బ్రహ్మానందం గొర్తి

## సరిలేరు మనకెవ్వరూ ...

ఓ సారి ఓ తెలుగు వ్యక్తికీ, కన్నడిగునికీ, తమిళ తంబికీ వారిలో ఎవరు గొప్ప అన్న సంశయం వచ్చింది. ఎవరికివారు మేం గొప్ప అంటే మేం గొప్ప అని అరుచుకున్నారు. అలాక్కాదు, మనం ముగ్గురూ ఓ పోటీ పెట్టుకొని అందులో ఎవరు నెగ్గితే వారు గొప్ప అని తేల్చేసుకుందాం, అని ఒక అంగీకారాని కొచ్చారు. దగ్గరలో ఉన్న ఒక కోతిని ఏదైనా ఒక జోకు చెప్పి నవ్వించాలి, వెంటనే ఇంకో విషయం చెప్పి ఏడిపించాలి, ఆఖరుగా ఒక విషయం చెప్పి అక్కడనుండి ఆ కోతి పరిగెత్తి పారిపోయేలా చేయాలి. అందరూ పందేనికి సరే నన్నారు. మొదట కన్నడిగుడు ఆ కోతి చెవిలో ఓ జోకు చెప్పాడు. కోతి నవ్వలేదు తమిళ తంబి కూడా చెవిలో జోకు చెప్పినా నవ్వలేదు. తెలుగువాడి వంతు వచ్చింది. కోతి చెవిలో ఒకటే మాట అన్నాడు. అంతే కోతి పగలబడి నవ్వడం మొదలు బెట్టింది. మొదటి పందెం సరే, రెండోది. కన్నడిగుడు కోతి చెవిలో ఓ సీరియస్ కథ

చెప్పాడు. కోతి ఉలుకూ పలుకూ లేదు. తమిళ తంబి ప్రయత్నం కూడా వృధా అయ్యింది. తెలుగువాడు వెళ్ళి ఆ కోతి చెవిలో ఒక వాక్యం చెప్పడమే తడవు కోతి గుర్రుగా కోపంతో చూసింది. ఇహ - ఆఖరి పందెం. ఈ ఆఖరి దాంట్లో కూడా కన్నడిగుడికీ, తమిళ తంబికి పరాజయం తప్పలేదు. తెలుగు వాడు వెళ్ళి ఒకటే చెప్పాడు. ఇంకా వాక్యం పూర్తి కాకుండానే అక్కడనుండి  కోతి పరుగు పరుగున వెళ్ళిపోయింది. నువ్వే గొప్ప, మేం ఈ పందెంలో ఓడిపోయామంటూ కన్నడిగుడు తమిళ తంబి ఒప్పుకున్నారు. కానీ వారికి తెలుగువాడు మూడు పందేలు ఎలా నెగ్గేడో తెలుసుకోవాలనిపించింది. చెప్పమని ప్రాధేయపడ్డారు. తెలుగువాడు చెప్పడం ప్రారంభించాడు.

"ఓ అదా! మొదటి పందెం కోతిని నవ్వించడం కదా? ఏముంది.? తెలుగువాళ్ళందరూ కలసిగట్టుగా ఉన్నారని చెవిలో చెప్పాను. అంతే ఆ కోతి పగలబడి నవ్వింది."

ఇహ రెండో పందెం - కోతికి కోపం రప్పించడం - పదేళ్ళ క్రిందట హైదరాబాదులో గజం రూపాయికొన్న స్థలం ఇప్పుడు గజం ఇరవై లక్షలకి అమ్మి లాభం పొందానని చెప్పాను. అసూయతో గుర్రుగా చూసింది అని చెప్పాడు.

"ఈ రెండు సరే ఆ  కోతిని ఇక్కడ నుండి ఎలా పారిపోయేలా చేయ గలిగావు? అని  కన్నడిగుడు, తమిళ తంబి అడిగారు.

"ఓ అదా ! ఏముంది.  ఆ కోతిని హీరోగా బెట్టి తెలుగు సినిమా తెస్తాను అని చెప్పాను. వెంటనే  హీరోయిన్ కోసం ముంబయ్ పరిగెత్తింది" అని విజయగర్వంతో చెప్పాడు.

## డేటింగ్ డైటింగ్



**డేటింగ్** - ఒకే రోజులో తక్కువ ప్రేమ ఎక్కువ ఫలితం

**డైటింగ్** - చాలారోజులు ఎక్కువ శ్రమ అతి తక్కువ ఫలితం

రెండింట్లోనూ తప్పనిది పరి'శ్రమ'

## బహు మతి



అప్పారావుకి వారిజకి పెళ్ళి అయ్యి పాతికేళ్ళయ్యింది. వెడ్డింగ్ యానివర్సిరీకి బహుమతి ఏం కావాలంటూ శ్రీమతిని అడిగాడు.

"వజ్రాల నెక్లసా?"

"నాకేం వద్దు? "

"పోనీ నీ పేర హైద్రాబాదులో ఎపార్ట్‌మెంటా? "

"అదీ వద్దు. "

"మరేం కావాలి? " గట్టిగా అడిగాడు అప్పారావు.

"నాకు మీనుండి విడాకులు కావాలి?"

ఖంగుతిన్నాడు అపారావు. ఒక్కసారి తేరుకొని..

"సారీ డియర్ ! అంత ఖర్చు నేను భరించలేను. ఇంకేదైనా కోరుకో !"

# అదీ  విషయం

ప్రముఖ కవి స్వర్గీయ విశ్వనాథ సత్యనారాయణ ఎవరినీ లెక్కజేసేవారు కాదు. ఏదైనా కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేవారు. ఓ సారి ఒకాయన వచన కవిత్వం రాసాడు. పుస్తకం అచ్చు వేయించుకుందామని అనుకున్నాడు. విశ్వనాథ వారు పీఠిక రాస్తే బాగుంటుంది, అదీకాక - ఆయన పీఠిక రాస్తే తన పుస్తకానికీ కాస్త గిరాకీ పెరుగుతుంది కదా అని ఆలోచించి విశ్వనాథ వారిని సంప్రదించాడు. విశ్వనాథ వారు సరే మీ కవిత్వం ఇవ్వండి చదివి ముందుమాట రాస్తానన్నారు. వారం తరువాత - విశ్వనాథవారు ముందుమాట రాసిచ్చారు. అందులో కవిగారి కవిత్వం గురించి ఒక్క వాక్యం లేదు. ఏ కవిత గురించీ ప్రస్తావన లేదు సరికదా, రామాయణ మహాకావ్యం యొక్క విశిష్టత గురించి రెండు పేజీలు రాసిచ్చారు. కవిగారికి ఒళ్ళు మండిపోయింది. విశ్వనాథవారిమీద గయ్యిమని లేచాడు. మీ ముందుమాటలో నా కవిత్వం గురించి రాస్తారనుకుంటే రామాయణ విశిష్టత గురించి రాసేరేమిటి అని నిలదీసాడు. పాఠకులు ఈ పుస్తకం చదివితే మొత్తం పుస్తకంలో ఏదో ఒక విషయం ఉండాలి కదా? ముందు మాటలోనేనైనా కనీసం విషయం చేరిస్తే పుస్తకం అమ్ముడుపోతుంది కదా అని అలా రాసాను అని సమాధానం చెప్పారు. విశ్వనాథ వారి చురక కవిగారికి బాగానే అంటి మెల్లగా అక్కడనుండి జారుకున్నారు.

# అర్థాలే  వేరులే

క్రితం నెల ఆడవారి మాటలకు అర్థాలు పీకానని నా పీకనొక్కేంత పనిజేసారు . వాళ్ళ కోపాన్ని ఉపశమింపజేయడానికి మగవారి మాటలకి అర్థాలు ( ఉన్నా ) లేవని తప్పించుకున్నా... మగ మిత్రులకోసం ఈ ముక్తాయింపు.

.

**భర్త** : అవును

**అసలు అర్థం:** నిన్ను కాదనే ధైర్యం లేదు

**భర్త** : కాదు

**అసలు అర్థం:** నువ్వు కాదన్నాక నే అవునంటే బ్రతగ్గలనా?

**భర్త** : నీ ఇష్టం

**అసలు అర్థం:** నా ఇష్టం ఇంకోటి త్వరలో చెబుతా

**భర్త** : నీ ఇష్టమే నా ఇష్టం

**అసలు అర్థం:** నే కాదన్నా నువ్వు వినవన్న సంగతి తెలుసు

**భర్త** : ఈ సారి బోనస్ మరీ తగ్గించారు.

**అసలు అర్థం:** పండగకి పిల్లలకి బట్టలు కట్ ! నీకు చీర తప్పదన్న విషయం తెలుసు

భర్త : ఇవాళ ఆఫీసులో లంచ్ పార్టీ ఉంది.
అసలు అర్థం: రోజూ నీ వంట తినలేక చస్తున్నా!

భర్త : మెల్లిగానే చెబుతునాకదా?
అసలు అర్థం: అరిచినా నీ బుర్రకెక్కదన్న విషయం నాకు తెలుసు

భర్త : పిల్లాడు లేచినట్లున్నాడు. నువ్వెందుకులే నేనున్నాగా!
అసలు అర్థం: రాణీవారు మంచం దిగరన్న విషయం తెలుసు !
ఎలాగూ నా నెత్తిమీదే పడుతుందని తెలుసు

భర్త : నిన్ను తప్ప ఎంకెవరిని ప్రేమిస్తాను చెప్పు?
అసలు అర్థం: తప్పనిసరై ప్రేమిస్తున్నాను. - అవకాశం వస్తే...

భర్త : నువ్వీ మధ్య ఎంతగానో నన్ను అర్థం చేసుకుంటున్నావు
అసలు అర్థం: నేను మందు ఎక్కువ కొట్టినా నోరెత్తడం లేదని
గుర్తించాను.

భర్త : మా అమ్మ ఈ శనివారం వస్తుంది. . ఓ రెండు రోజులుండి
వెళుతుంది. ఖర్చులు పెరిగాయన్న విషయం నాకు గుర్తుంది.
అసలు అర్థం: మీ అమ్మానాన్న నెలలు తిష్టవేసినా మనకసలు ఖర్చే
శూన్యం ! ప్రేమకి ఖర్చు రాయలేం కదా?

భర్త : ఇంటి చాకిరీ చేసి చేసి నీ ఆరోగ్యం పాడయిపోతోంది.

నాకు ఎలాగూ తప్పదు. మా మేనల్లుడి పెళ్ళికి ఉదయం వెళ్ళి రాత్రికొచ్చేస్తాలే!

అసలు అర్థం: నే రమ్మంటే యుద్ధం తప్పదని తెలుసు. నే వెళ్ళొస్తే మా వాళ్ళ ముందు కాస్త పరువైనా దక్కుతుంది.

భర్త : రామారావు వాళ్ళావిడ చాలా మంచి కుక్ ట!

బాంక్ లో పనిజేసే ఆవిడకంత టైమెక్కడిదో?

అసలు అర్థం: ఉద్యోగం చెయ్యమని పోరకపోయినా నా మొహాన పచ్చడి మెతుకులేనా?

భర్త : నీ కోసం ప్రత్యేకంగా ఈ రవ్వల నెక్లెసు కొన్నాను.

అసలు అర్థం: స్టాకుల్లో మన పెట్టుబడి గంగార్పణం చేసాను.

ఆడవారి మాటలకు అర్థాలువేరులేకి వారిచ్చిన డోసుకు ఇంకా కోలుకోలేదు.



వచ్చేనెల రండి.